# నేడు మునుగోడుకు సీఎం కేసీఆర్

**ప్రజా ఆశీర్వాద సభకు సర్వం సిద్ధం**

మధ్యాహ్నం 3 గంటలకు బహిరంగ సభ
స్వచ్ఛందంగా తరలివచ్చేందుకు జనం సిద్ధం

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్25(నమస్తే తెలంగాణ)/మునుగోడు : మునుగోడు నియోజకవర్గం కేంద్రంలో గురువారం జరుగనున్న ప్రజా ఆశీర్వాద సభకు ఏర్పాట్లన్నీ పూర్తయ్యాయి. గతేడాది ఆగస్టు 20న మునుగోడు ఉప ఎన్నికలకు ముందు నిర్వహించిన విశాలమైన స్థలంలోనే ప్రస్తుత సభకు ఏర్పాట్లు పూర్తి చేశారు. మునుగోడు నుంచి చౌటుప్పల్‌కు వెళ్లే దారిలో ఎడమ వైపున ఉన్న స్థలంలో ప్రజా ఆశీర్వాద సభ నిర్వహించనున్నారు. సభ వేదిక, వీఐపీ, మీడియా, స్థానిక ప్రజాప్రతినిధులు, మహిళల గ్యాలరీలను ప్రత్యేకంగా బారికేడ్లతో ఏర్పాటు చేశారు. వాటితోపాటు కళాకారుల కోసం మరో వేదికను సిద్ధం చేశారు. ఇక సీఎం కేసీఆర్ హెలికాప్టర్‌లో రానున్న నేపథ్యంలో సభా వేదికకు పక్కనే మూడెకరాల్లో హెలిప్యాడ్‌ను రెడీ చేశారు. హెలిప్యాడ్ నుంచి నేరుగా సభా వేదికకు సీఎం కేసీఆర్‌తోపాటు ఇతర ప్రముఖులు చేరుకునేందుకు ప్రత్యేకంగా ఏర్పాట్లు చేశారు. అలాగే సీఎం కేసీఆర్ సభకు ప్రజలు కూడా పెద్దఎత్తున తరలివచ్చేందుకు సిద్ధం కావడంతో అందుకనుగుణంగా 25 ఎకరాల్లో సభాస్థలిని సిద్ధం చేశారు. ఇక సభకు ప్రజలు తీసుకొచ్చే వాహనాల కోసం మునుగోడుకు మూడు వైపులా ఎనిమిది చోట్ల పార్కింగ్ స్థలాలను ఏర్పాటు చేశారు. చండూరు, నాంపల్లి, మర్రిగూడెం మండలాల నుంచి వచ్చే వారి కోసం తాసీల్దార్ కార్యాలయం ఎదుట, మరికొన్ని చోట్ల పార్కింగ్ స్థలాలు అందుబాటులోకి తీసుకొచ్చారు. చౌటుప్పల్, నారాయణపురం, గట్టుప్పల్, మర్రిగూడెంలోని కొన్ని గ్రామాల నుంచి వచ్చే వారి కోసం చౌటుప్పల్ రూట్‌లోని కాటన్ మిల్లుల వద్ద పార్కింగ్ సౌకర్యం కల్పించారు. వీటితోపాటు మధ్యాహ్నం సభ కావడంతో సభా స్థలంలో ప్రజల కోసం ప్రత్యేకంగా మంచినీటి వసతిని ఏర్పాటు చేస్తున్నారు. సభకు తరలివచ్చే వారికి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా మునుగోడు-చౌటుప్పల్, మునుగోడు- చండూర్ రూట్లలో సభకు వచ్చే వాహనాల రద్దీ ఉండనుండడంతో ఈ మార్గాల్లో గురువారం మధ్యాహ్నం నుంచి సాధారణ ప్రయాణికులు రాకపోవడమే మంచిదని నిర్వాహకులు సూచిస్తున్నారు. గత వారం రోజులుగా సభ ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి దగ్గరుండి పర్యవేక్షిస్తున్నారు. బుధవారం కూడా సభా వేదిక, ఇతర ఏర్పాట్లను స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ఏర్పాట్లన్నీ పూర్తయినట్లు ప్రకటించారు. ఎమ్మెల్యే వెంట రాష్ట్ర కల్లు గీత కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్‌గౌడ్, ఎంపీపీ కర్నాటి స్వామియాదవ్, బీఆర్ఎస్ మునుగోడు, చండూరు బీఆర్ఎస్ మండలాధ్యక్షులు బండ పురుషోత్తం రెడ్డి, బొమ్మరబోయిన వెంకన్న, మాజీ ఎంపీపీ తోకల వెంకన్న, బీఆర్ఎస్ యువజన విభాగం మండలాధ్యక్షుడు ఉజ్జిని అనిల్ రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్వాయి గోవర్ధన్‌రెడ్డి, పోలగోని సైదులు గౌడ్, ఐతగోని విజయ్‌కుమార్, బండారు వెంకన్న మధుసూదన్ రావు, బూతరాజు దశరథ తదితరులు ఉన్నారు.


మునుగోడులో సభ ఏర్పాట్లను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, నాయకులు పల్లె రవి తదితరులు

### భారీ బందోబస్తు

సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభలో పాల్గొననున్న నేపథ్యంలో పోలీసు శాఖ భారీ బందోబస్తు చేపట్టింది. ఇప్పటికే సభా ప్రాంగణాన్ని, హెలిప్యాడ్ స్థలాన్ని, హెలిప్యాడ్ నుంచి సభ వేదిక వద్దకు వచ్చే మార్గాలన్నీ తమ ఆధీనంలోకి తీసుకుని భద్రత చర్యలు చేపట్టింది. బాంబ్ స్క్వాడ్ టీమ్‌లు తనిఖీలు చేశాయి. భద్రతాపరంగా అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు జిల్లా ఎస్పీ అపూర్వ రావు తెలిపారు. బుధవారం మునుగోడులో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, ఎస్పీ అపూర్వరావు, ఇంటెలిజెన్స్ ఎస్పీ జి.కవిత పర్యటించారు. సభా స్థలాన్ని, హెలిప్యాడ్, ఇతర ఏర్పాట్లను పరిశీలించి తగు సూచనలు చేశారు. బందోబస్తు చర్యలపై స్థానిక అధికారులతో సమీక్షించి ఆదేశాలిచ్చారు. ఎన్నికల కమిషన్ నిబంధనలకు అనుగుణంగా చర్యలు చేపట్టాలని సూచించారు.


నాంపల్లి మండలం ఎస్‌డబ్ల్యూ లింగోటంలో ఏర్పాటు చేసిన మిషన్ భగీరథ ట్రీట్‌మెంట్ ప్లాంట్

ఫ్లోరైడ్ రహిత నియోజకవర్గంగా అవతరణ
డిండి ఎత్తిపోతలతో సాగునీటికి శాశ్వత పరిష్కారం
గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌తో పారిశ్రామిక ప్రగతి
రూ.4,500 కోట్లతో మునుగోడు నియోజకవర్గ అభివృద్ధి
ఉప ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీకి కార్యరూపం
సీఎం కేసీఆర్ ప్రజా ఆశీర్వాద సభపై సర్వత్రా ఆసక్తి
అభిమాన నేతకు ఘన స్వాగతం పలికేందుకు సిద్ధమైన మునుగోడు జనం

# బీఆర్ఎస్‌తోనే మునుగోడుకు మహర్దశ

**స్వరాష్ట్రంలోనే అభివృద్ధి అడుగులు**

నల్లగొండ ప్రతినిధి, అక్టోబర్25(నమస్తే తెలంగాణ) సమైక్య పాలనలో ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అత్యంత వెనకబడ్డ నియోజకవర్గం మునుగోడు. తాగేందుకు మంచినీళ్లు లేక ఫ్లోరైడ్ భూతానికి చిక్కి కుప్పకూలింది. పంటల సాగుకు నీటి వనరుల్లేక భూమి బీడు పడింది. కంకర తేలి గుంతలమయంగా మారిన రోడ్లపై ప్రయాణం అంటే నరకం కనిపించేది. ఇక.. విద్య, వైద్యం అందని ద్రాక్షే. అలాంటి ఈ నియోజకవర్గం తెలంగాణ పోరాటంలో ఉద్యమ రథసారథి కేసీఆర్ వెంట నడిచి రాష్ట్ర సాధనలో తన వంతు ప్రత్యేక పాత్రను పోషించింది. అందుకే స్వరాష్ట్రంలో మునుగోడును ముందడుగు వేయించేలా సీఎం కేసీఆర్ అత్యంత శ్రద్ధను కనబరుస్తున్నారు. 2014 నుంచి ఇప్పటి వరకు రూ.4,500 కోట్లతో అన్ని రంగాల్లో అభివృద్ధికి బాటలు వేశారు. మిషన్ భగీరథ జలాలతో ఫ్లోరైడ్ రక్కసిని తరిమి కొట్టారు. శాశ్వత పరిష్కారం దిశగా డిండి ఎత్తిపోతల ద్వారా రిజర్వాయర్ల పనులు చేపట్టారు. రాష్ట్రానికి తలమానికంగా దండుమల్కాపూర్‌లో గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌ను ఏర్పాటు చేసి ఉపాధికి పెద్దపీట వేశారు. అన్ని రంగాల్లో వసతులు, సబ్బండ వర్గాలకు సంక్షేమ పథకాలు అందించి మునుగోడు నియోజకవర్గం రూపురేఖలు మార్చారు. ఏడాది కిందట ఇక్కడ జరిగిన ఉప ఎన్నికల్లో నియోజకవర్గ ప్రజలు అందుకే మళ్లీ బీఆర్ఎస్‌ను గెలిపించుకున్నారు. రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో మరోసారి బీఆర్ఎస్‌కు జైకొట్టేందుకు సిద్ధంగా ఉన్నారనడంలో సందేహమే లేదు.


నాంపల్లిలో ఇంటి వద్ద భగీరథ నీళ్లు పడుతున్న మహిళ

సమైక్య పాలనలో మునుగోడు దుస్థితిని స్వయంగా చూసి చలించిపోయిన కేసీఆర్ స్వరాష్ట్రంలో ఏం చేస్తానో ఆనాడే చెప్పారు. 60 ఏండ్లల్లో ఫ్లోరైడ్‌ను పెంచి పోషించిన కాంగ్రెస్, బీజేపీ పాలకులకు చెంపచెల్లు మనిపించేలా ఆరేండ్లల్లోనే ఫ్లోరైడ్ రక్కసిపై పైచేయి సాధించారు. ఇక్కడే శ్రీకారం చుట్టిన మిషన్ భగీరథతో కొత్తగా ఒక్క ఫ్లోరైడ్ కేసు నమోదు కాలేదని పార్లమెంట్ సాక్షిగా కేంద్రమే ప్రకటించింది. ఇక దీనికి తోడు శాశ్వత నివారణ చర్యల్లో డిండి ఎత్తిపోతల పథకం ద్వారా మునుగోడు నియోజకవర్గంలోని 2.55లక్షల ఎకరాలకు సాగునీరు అందేలా చర్లగూడెం, లక్ష్మణాపురం రిజర్వాయర్ల నిర్మాణాలు కొనసాగుతున్నాయి. ఇక రహదారులు, గ్రామాల్లో మౌలిక వసతులు ఇలా అనేక రంగాల్లో మునుగోడు ప్రగతిపథంలో సాగుతున్నది. అందుకే బీఆర్ఎస్‌నే మునుగోడుకు మేలిమలుపని ఇక్కడి ప్రజలు భావిస్తున్నారు. అసెంబ్లీ ఎన్నికలకు ఏడాది ముందే క్షేత్రస్థాయిలో ఉప ఎన్నికల్లో ప్రజలు తమ మనోగతాన్ని స్పష్టం చేశారు. 2018లో కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి చెప్పిన పెద్ద పెద్ద డైలాగుల మాయలో పడి బీఆర్ఎస్‌ను దూరం చేసుకున్న ప్రజలు సైతం వెంటనే తిరిగి ఆలోచనలో పడ్డారు. మునుగోడు అభివృద్ధికి రాజగోపాల్‌రెడ్డి ఆటంకంగా ఉన్నాడని భావిస్తూ ఉప ఎన్నిక రూపంలో అందివచ్చిన అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకున్నారు. ముఖ్యమంత్రి కేసీఆర్ మార్గదర్శనంలో బీఆర్ఎస్ అభ్యర్థి కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డిని ఎమ్మెల్యేగా గెలిపించుకుని తిరిగి అభివృద్ధికి దారులు వేసుకున్నారు. దీంతో ఉప ఎన్నికల్లో సీఎం కేసీఆర్ ఇచ్చిన ప్రతి హామీ అమల్లోకి వచ్చింది. 2014 నుంచి 2018 సెప్టెంబర్ వరకు బీఆర్ఎస్ ఎమ్మెల్యేగా ఉన్న కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి రూ.3,545 కోట్లతో నియోజకవర్గంలో పెద్ద ఎత్తున అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు చేపట్టారు. తిరిగి ఉప ఎన్నికల్లో గెలిచిన అనంతరం ఏడాది కాలంలోనే సుమారు రూ.600 కోట్లతో పనులకు శ్రీకారం చుట్టారు.

### అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధ : ఎమ్మెల్యే కూసుకుంట్ల

మునుగోడు అభివృద్ధిపై సీఎం కేసీఆర్ ప్రత్యేక శ్రద్ధతో ఉన్నారు. ఇప్పటికే చండూర్ రెవెన్యూ డివిజన్ ఏర్పాటుతోపాటు చౌటుప్పల్‌లో 100 పడకల ఆస్పత్రి నిర్మాణంలో ఉన్నది. అంతర్గత రోడ్లు, బీటీ రోడ్ల నిర్మాణాలు ముమ్మరంగా సాగుతున్నాయి. మౌలిక వసతులు కల్పనపై ప్రత్యేక దృష్టి పెట్టాం. చేనేత పరిశ్రమకు అండగా నిలిచాం. విద్యా, వైద్య పరంగానూ మెరుగైన వసతుల కల్పనకు పెద్దపీట వేస్తున్నాం. దశాబ్దాల కాంగ్రెస్ పాలనలో మునుగోడును పట్టి పీడించిన ఫ్లోరైడ్‌ను పారదోలిన ఘనత కేసీఆర్‌దే. ఉప ఎన్నికల్లో గెలిపించినందుకు మునుగోడు ప్రజలు జరుగుతున్న అభివృద్ధితో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్‌తోనే అభివృద్ధి సాధ్యమంటూ విశ్వసిస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం వచ్చాక మునుగోడు గోడును తీర్చిన ముఖ్యమంత్రి కేసీఆర్‌కు ఘన స్వాగతం పలికేందుకు ప్రజలు సిద్ధమవుతున్నారు. నేడు తలపెట్టిన ప్రజా ఆశీర్వాద సభకు ప్రజల నుంచి అనూహ్య స్పందన కనిపిస్తున్నది. వచ్చే ఎన్నికల్లో గెలిపిస్తే మిగిలి ఉన్న అన్ని సమస్యలకు పరిష్కారం చూపే బాధ్యత నాదే. సభకు ప్రజలంతా పెద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలి.

### రూ.600 కోట్లతో ఉప ఎన్నికల హామీల అమలు

మునుగోడు నియోజకవర్గ రూపురేఖలు మారుస్తామన్న ముఖ్యమంత్రి కేసీఆర్ మాటలు ఒక్కొక్కటిగా ఆచరణరూపం దాలుస్తున్నాయి. ఏడాదిలోగానే ఇచ్చిన ప్రతి హామీని నిలబెట్టుకుంటూ అన్నీ కార్యరూపంలోకి తెచ్చారు. ఇచ్చిన మాట ప్రకారమే నవంబర్‌లో 6న ఎన్నికల ఫలితాలు వెలువడితే డిసెంబర్1న మంత్రి కేటీఆర్ స్వయంగా మునుగోడు వచ్చి సమీక్ష చేశారు. జిల్లా మంత్రి జగదీశ్‌రెడ్డితో కలిసి మునుగోడు అబివృద్ధిపై రోడ్‌మ్యాప్‌ను మంత్రి కేటీఆర్ ప్రకటించారు. దాని ప్రకారమే అన్ని పనులు కార్యరూపం దాల్చాయి. ఉప ఎన్నికల్లో కీలకమైన డిమాండ్‌గా ఉన్న చండూర్‌ను రెవెన్యూ డివిజన్‌గా ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఉప ఎన్నికల సమయంలోనే గట్టుప్పల్‌ను నూతన మండలంగా ఏర్పాటు చేశారు. ఉప ఎన్నికల హామీ మేరకు చౌటుప్పల్ కేంద్రంగా 100 పడకల ఆస్పత్రిని మంజూరు చేశారు. రూ.38కోట్లతో మంత్రులు హరీశ్‌రావు, జగదీశ్‌రెడ్డి శంకుస్థాపన చేయగా నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇక ఇదే సమయంలో ఈ ఏడాది జనవరి 3న చౌటుప్పల్ ప్రభుత్వ ఆస్పత్రిలో ఐదు యూనిట్లతో డయాలసిస్ సేవలు అందుబాటులోకి వచ్చాయి. మర్రిగూడలో 30 పడకల కమ్యూనిటీ హెల్త్ సెంటర్ నూతన భవనాన్ని ప్రారంభించారు. సంస్థాన్ నారాయణపురం కేంద్రంగా ఎస్టీ గురుకుల పాఠశాలతోపాటు బంజారార భవన్ ఏర్పాటు చేస్తామన్న హామీని నెరవేర్చారు.

### రూ.3.68 కోట్లతో చేనేత క్లసర్లు

చేనేత పరిశ్రమకు మునుగోడు నిలయం కాగా అందుకు అనుగుణంగా హ్యాండ్లూమ్ క్లస్టర్ల ఏర్పాటుపై మంత్రి కేటీఆర్ ప్రత్యేక శ్రద్ధ పెట్టారు. నారాయణపురం, గట్టుప్పల్, తెరట్‌పల్లిల్లో చేనేత క్లస్టర్లు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రకటించి వెంటనే నిధులు మంజూరు చేశారు. గట్టుప్పల్‌లో రూ.2.37కోట్లతో, తెరట్‌పల్లిలో రూ.76లక్షలతో, నారాయణపురంలో రూ.73లక్షలతో క్లస్టర్లకు తొలి విడుతగా 60శాతం నిధులు విడుదల చేశారు. దాంతో మగ్గాల కొనుగోళ్లు, ఆసు యంత్రాలకు ఆర్డర్లు, ఇతర సామగ్రి సమకూర్చుకోవడంపై దృష్టి పెట్టారు. త్వరలోనే ఇవి పూర్తి స్థాయిలో అందుబాటులోకి రానున్నాయి.


చౌటుప్పల్ పట్టణంలో వేసిన సీసీ రోడ్డు

### మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధ

అంతర్గత రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థ, బీటీ రోడ్ల నిర్మాణం లాంటి మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక శ్రద్ధతో వందల కోట్లరూపాయలను వెచ్చిస్తున్నారు. నియోజకవర్గ వ్యాప్తంగా రూ.105 కోట్లతో 50కి పైగా మట్టి రోడ్లను బీటీ రోడ్లుగా మారుస్తున్నారు. ఇందులో ఇప్పటికే చాలా వరకు పనులు ప్రారంభమయ్యాయి. ట్రైబల్ వెల్ఫేర్ ఫండ్ నుంచి మరో రూ.25కోట్లతో గిరిజన ప్రాంతాల్లో బీటీ రోడ్లను నిర్మిస్తున్నారు. ఉపాధి హామీ నిధులు రూ.35కోట్లతో గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణం ఇప్పటికే పూర్తైంది. మరో రూ.50కోట్లతో ఆర్‌అండ్‌బీ రహదారుల నిర్మాణం జరుగుతున్నది

### కీలకమైన అభివృద్ధి పనుల్లో కొన్ని...

- తిరుగండ్లపల్లి, లచ్చమ్మగూడెం, పెద్దకొండూరులతో పాటు మరో రెండు చోట్ల మొత్తం ఐదు 33/11 కేవీ సబ్ స్టేషన్లకు శంకుస్థాపన
- చండూరు మున్సిపాలిటీలో రూ.30 కోట్లతో ముమ్మరంగా రోడ్ల విస్తరణ పనులు
- చండూర్‌లో రెండు కోట్లతో సమీకృత మార్కెట్, మరో రెండు కోట్లతో ఆధునిక ధోబీఘాట్ నిర్మాణ పనులు
- చౌటుప్పల్ మున్సిపాలిటీలో అభివృద్ధి పనుల కోసం రూ.50 కోట్ల మంజూరు..కొనసాగుతున్న పనులు
- చౌటుప్పల్ మండలంలో రూ.25 కోట్ల హెచ్‌ఎండీఏ నిధులతో కొనసాగుతున్న రోడ్లు, డ్రైనేజీ నిర్మాణాలు
- దండుమల్కాపూర్‌లోని గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్‌లో 100 ఎకరాల్లో టాయ్స్ పార్క్ ప్రారంభం

### ప్రజల్లో సానుకూలత

స్వరాష్ట్రంలో బీఆర్ఎస్ సర్కార్ చేసిన అభివృద్ధిపై మునుగోడు ప్రజల్లో సానుకూలత వ్యక్తమవుతున్నది. 2104 కంటే ముందు నియోజకవర్గ పరిస్థితిని, నేటి పరిస్థితులను బేరీజు వేసుకుంటూ బీఆర్ఎస్ వైపునకు జనం మొగ్గుచూపుతున్నారు. బీఆర్ఎస్‌తోనే స్థిరమైన అభివృద్ధి సాధ్యమన్న చర్చ సర్వత్రా సాగుతున్నది. ఎన్నికలు ఎప్పుడొచ్చినా బీఆర్ఎస్‌ను గెలిపించేందుకు ఇక్కడి ప్రజలు ఇప్పటికే మానసికంగా సిద్ధమయ్యారు. మునుగోడు ప్రజా ఆశీర్వాద సభ వేదిక మీదుగా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లోనూ తమకు తిరుగులేదని చాటిచెప్పేందుకు సిద్ధమయ్యారు.


చౌటుప్పల్ ప్రభుత్వ దవాఖానలో డయాలసిస్ సేవలు


గ్రీన్ ఇండస్ట్రియల్ పార్క్ పైలాన్



# టాప్ గేర్‌లో కారు




క్షేత్రస్థాయిలో దూసుకెళ్తున్న గులాబీ పార్టీ
ఇంటింటికీ ఎమ్మెల్యేలు, కుటుంబసభ్యులు
ప్రభుత్వ అభివృద్ధి, సంక్షేమ పథకాలపై కేడర్ ప్రచారం
ఉక్కిరిబిక్కిరి అవుతున్న విపక్షాలు

యాదాద్రి భువనగిరి, అక్టోబర్ 25 (నమస్తే తెలంగాణ) :ఎన్నికల సంగ్రామంలో బీఆర్ఎస్ పార్టీ విపక్షాలకు అందనంత స్పీడ్‌తో దూసుకుపోతున్నది. ఆ పార్టీ అభ్యర్థులు, సిట్టింగ్ ఎమ్మెల్యేలు క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ ప్రజలతో మమేమకమవుతున్నారు. ఇంటింటికీ వెళ్లి పదేండ్లలో బీఆర్ఎస్ ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరిస్తున్నారు. కేడర్ సైతం బీఆర్ఎస్ ప్రకటించిన మ్యానిఫెస్టోను ప్రజల్లోకి తీసుకెళ్తున్నది. ఇప్పటికే ఆ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్ భువనగిరి సభ కేడర్‌లో ఫుల్ జోష్ నింపగా.. గురువారం మునుగోడు, ఈ నెల 29న ఆలేరులో నిర్వహించనున్న సీఎం సభలకు సబ్బండ వర్గాల ప్రజలకు సిద్ధమవుతున్నారు. బీఆర్ఎస్‌కు జనంలో ఉన్న ఆదరణను, అభ్యర్థుల ప్రచార హోరును తట్టుకోలేక విపక్షాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. ఆయా పార్టీలు ఇంకా అభ్యర్థుల ప్రకటన దగ్గరే ఆగిపోవడం గమనార్హం. జిల్లాలో ఎన్నికల వేడి రాజుకుంది. బీఆర్ఎస్ అభ్యర్థులు జోరుగా ప్రచారం చేస్తున్నారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్ రెడ్డితోపాటు డీసీసీడీ చైర్మన్ గొంగిడి మహేందర్‌రెడ్డి రాజకీయంగా చక్రం తిప్పుతున్నారు. ఇప్పటికే మండలాలు, గ్రామాల్లో పార్టీ కార్యాలయాలు ప్రారంభించారు. పెద్ద సంఖ్యలో చేరికలు జరుగుతున్నాయి. భువనగిరి ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డితో ఆయన సతీమణి వనిత, కుమార్తె మన్వితా రెడ్డి జోరుగా ప్రచారం చేస్తున్నారు. ముగ్గురు కలిసి ఒక్కోరోజు ఒక్కో మండలంలో విస్తృతంగా ప్రచారం కొనసాగిస్తున్నారు. మునుగోడు ఎమ్మెల్యే కూసుకుంట్ల ప్రభాకర్ రెడ్డి నిత్యం ప్రజల్లోనే ఉంటున్నారు. తుంగతుర్తి ఎమ్మెల్యే గాదరి కిశోర్ మోత్కూరు, అడ్డగూడూరు, నకిరేకల్ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య రామన్నపేటలో ముమ్మరంగా ప్రచారం చేస్తున్నారు. మరోవైపు పెద్ద ఎత్తున చేరికల కార్యక్రమాలు చేపడుతున్నారు.


భూదాన్‌పోచంపల్లిలో ఎన్నికల ప్రచారంలో భాగంగా మగ్గం నేసి ఓట్లు అభ్యర్థించిన ఎమ్మెల్యే పైళ్ల శేఖర్‌రెడ్డి

### అటు ప్రభుత్వ కార్యక్రమాలు.. ఇటు మ్యానిఫెస్టో

బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతోపాటు నాయకులు, కార్యకర్తలు పార్టీ గెలుపు కోసం నిరంతరం శ్రమిస్తున్నారు. ఇప్పటికే కేసీఆర్ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పిస్తున్నారు. కల్యాణలక్ష్మి, ఆసరా పింఛన్లు, కేసీఆర్ కిట్, ధరణి, రైతుబంధు, రైతుబీమా, ఆరోగ్యలక్ష్మి తదితర ముఖ్య పథకాలను తెలియజేస్తున్నారు. మిషన్ భగీరథ, మిషన్ కాకతీయ, కాళేశ్వరం జలాలు తదితర అభివృద్ధి పనులను వివరిస్తున్నారు. అంతేకాకుండా ఇటీవల కేసీఆర్ ప్రకటించిన బీఆర్ఎస్ మ్యానిఫెస్టోను కూడా స్పష్టంగా చెబుతున్నారు. అధికారంలోకి రాగానే రైతు బీమా రూ.16వేలు, ఆసరా పింఛన్ల పెంపు, కేసీఆర్ ధీమా, సన్నబియ్యం పంపిణీ, మహిళలకు నెలకు రూ. రూ.3వేలు, రూ.400కే గ్యాస్ సిలిండర్ తదితర హామీలను తెలియజేస్తున్నారు. అంతే కాకుండా కాంగ్రెస్ వల్ల కలిగే నష్టాలు, కష్టాలను విడమరిచి చెబుతున్నారు.


రామన్నపేట మండలం ఇంద్రపాలనగరంలో ఇంటింటి ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య, చిత్రంలో జడ్పీ చైర్మన్ ఎలిమినేటి సందీప్‌రెడ్డి

### సీఎం కేసీఆర్ పర్యటనతో మరింత జోష్..

సీఎం కేసీఆర్ రాష్ట్ర వ్యాప్తంగా సుడిగాలి పర్యటన చేస్తున్నారు. ఇప్పటికే ఇటీవల భువనగిరి పట్టణంలో జరిగిన ప్రజా ఆశీర్వాద సభకు హాజరై ప్రసంగించారు. దాంతో బీఆర్ఎస్ శ్రేణుల్లో జోష్ నెలకొంది. గురువారం మునుగోడు నియోజకవర్గంలో మరో సభ జరుగనున్నది. ఈ నెల 29న ఆలేరు పట్టణంలో సభను నిర్వహించనున్నారు. ఇలా వరుస సభలతో కేడర్‌లో మరింత ఉత్సాహం రానున్నది. ప్రజలు సైతం గులాబీ పార్టీకే జై కొడుతున్నారు. 'సారే కావాలి.. సారే రావాలి' అని నినదిస్తున్నారు.


నాగారం మండలం పేరబోయినగూడెంలో ప్రచారం చేస్తున్న ఎమ్మెల్యే గాదరి కిశోర్

### ప్రతిపక్షాల ఉక్కిరిబిక్కిరి

జెట్ స్పీడ్‌తో గులాబీ దళం ప్రజల్లోకి వెళ్తుంటే ప్రతిపక్షాలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నాయి. కాంగ్రెస్, బీజేపీలు ఇంకా అభ్యర్థులు తేలక దిక్కుతోచని పరిస్థితుల్లో కొట్టుమిట్టాడుతున్నాయి. భువనగిరి నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇంకా ఖరారు కాకపోవడంతో ఆ పార్టీ శ్రేణుల్లో గందరగోళం నెలకొంది. బీజేపీ మొదటి విడుత జాబితాలో ఆలేరు నియోజవర్గం పేరే లేదు. దీంతో ఆ పార్టీ కనీసం ఎవరికి ఓటు వేయాలో చెప్పుకోలేని దుస్థితిలో ఉంది. సీఎం కేసీఆర్ బీఆర్ఎస్ అభ్యర్థులను రెండు నెలల క్రితమే ప్రకటించిన విషయం తెలిసిందే.